# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- విద్యా సంస్థలు, అంకుర సంస్థల బలంపైనే 'వికసిత్ భారత్' ప్రస్థానం నిర్మాణం జరుగుతుందని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు.

- రానున్న దశాబ్దాలలో భారత్.. వేగవంతమైన ఆర్థికవృద్ధిని సాధిస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

- భారతదేశ ఆర్థికవృద్ధి అంచనాలను అంతర్జాతీయ సంస్థలు పెంచుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

- ఆసియా క్రీడలు-2026 ముగింపు వేడుకలు జపాన్‌లోని పాలోమా మిజుహో స్టేడియంలో ఈరోజు ఘనంగా జరిగాయి.

=========================

దేశంలోని విద్యాసంస్థలు, అంకుర సంస్థల బలంపైనే `వికసిత్ భారత్` ప్రస్థానం నిర్మాణం జరుగుతుందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ICSI) 58వ వ్యవస్థాపక దినోత్సవంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... పెట్టుబడిదారుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని పొందకుండా దేశం పురోగమించలేదని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందని, అలాగే.. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలోకి ప్రవేశిస్తోందని వివరించారు. కార్పొరేట్ పాలనను ప్రోత్సహించడంలో ICSI చేసిన కృషిని ఆయన ప్రశంసిస్తూ.. ఇది సుస్థిర అభివృద్ధికి ప్రపంచ ప్రమాణంగా అభివర్ణించారు. బలమైన ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించడంలో ICSI కృషి... భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెడుతుందని ఉపరాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

(వాయిస్ 15 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ శాంతి, భద్రత, సరఫరా గొలుసుల పునరుద్ధరణ, పరస్పర అనుసంధానం అనేవి అభివృద్ధి చెందుతున్న, మధ్యస్థ దేశాలకు అత్యంత కీలకమైనవని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `62వ మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్`లో భాగంగా మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్ వోల్ఫ్గ్యాంగ్ ఇషింగర్, జర్మనీ విదేశాంగ కార్యదర్శి బెర్నార్డ్ కోట్షలతో ఆయన చర్చలు జరిపారు. రానున్న దశాబ్దాలలో భారత్.. వేగవంతమైన ఆర్థికవృద్ధిని సాధిస్తుందని, ఇందుకు ఇక్కడి యువ జనాభా ఎంతగానో దోహదపడుతుందన్నారు. భారత్ ఇప్పుడు ఐరోపా సమాఖ్య (EU)తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటోందని చెప్పారు. అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), స్పేస్ రంగాలలో భారత్-EU భాగస్వామ్యం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను అంతర్జాతీయ సంస్థలు పెంచుతున్నాయని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ తెలిపారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన `కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్` సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. బలమైన కార్పొరేట్ పనితీరు, పెట్టుబడుల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా పురోగమిస్తోందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశం 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని, ఆ తరువాత కూడా ఇదే వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ప్రైవేట్ రంగంతో పాటు ప్రభుత్వ పెట్టుబడులు కూడా పెరగడం దేశ ఆర్థిక పురోగతికి సానుకూలంగా మారిందని, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా పెరిగిన ముడిచమురు ధరల ప్రభావం దేశంపై పడకుండా ప్రభుత్వం.. ప్రైవేట్ రంగం తీసుకున్న చర్యలు ఎంతగానో దోహదపడ్డాయని సౌరభ్ గార్గ్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడలు-2026 ముగింపు వేడుక జపాన్‌లోని నగోయాలో ఉన్న పాలోమా మిజుహో స్టేడియంలో ఈరోజు జరిగింది. ఈ వేడుకల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన షూటింగ్ క్రీడాకారిణి నీరు ధండా భారత బృందానికి నాయకత్వం వహించారు. భారత్ 21 స్వర్ణం, 27 రజతం, 37 కాంస్య పతకాలతో మొత్తం 85 పతకాలతో 4వ స్థానంలో నిలిచింది. హ్యాంగ్‌జౌ 2023లో సాధించిన రికార్డు స్థాయి పతకాల తర్వాత, ఆసియా క్రీడల చరిత్రలో భారత్ సాధించిన అత్యధిక పతకాల సంఖ్యలో ఇది రెండవది కావడం విశేషం. భారత మహిళా హాకీ జట్టు 1982 తర్వాత మొదటిసారిగా స్వర్ణం గెలిచింది. పురుషుల హాకీ జట్టు వరుసగా రెండు సార్లు ఆసియా క్రీడల టైటిల్స్ గెలుచుకోవడం ఇదే మొదటిసారి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళం దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో `సెఖోన్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మారథాన్` రెండవ ఎడిషన్‌ను నిర్వహించింది. భారత వైమానిక దళ అధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పీ. సింగ్, న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈరోజు మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్ వైస్ మార్షల్ శేఖర్ యాదవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... భారత వైమానిక దళం నుండి పరమ వీర చక్ర అందుకున్న ఏకైక వ్యక్తి ఫ్లయింగ్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్ జ్ఞాపకార్థం ఈ మారథాన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. 1971 ఇండో-పాకిస్తాన్ యుద్ధ సమయంలో ఫ్లయింగ్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని ఆయన తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పలు పార్లమెంటరీ కమిటీలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్ వ్యవస్థీకరించారు. ఈ కమిటీల పదవీకాలం గత నెల 26వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. లోక్‌సభ నుండి 21 మంది, రాజ్యసభ నుండి 10 మంది సభ్యులతో కూడిన ఆర్థిక కమిటీకి బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను ఛైర్‌పర్సన్‌గా నియమించారు. లోక్‌సభ నుండి 21 మంది, ఎగువ సభ నుండి 10 మంది సభ్యులతో కూడిన విదేశీ వ్యవహారాల కమిటీకి కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ను ఛైర్‌పర్సన్‌గా నియమించారు. రైల్వే కమిటీకి బీజేపీ ఎంపీ సుధీర్ గుప్తా, రసాయనాలు, ఎరువుల కమిటీకి లోక్‌సభ ఎంపీ డాక్టర్ కాకోలి ఘోష్ దస్తిదార్‌ను ఛైర్‌పర్సన్లుగా నియమించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన.. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0' కింద 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి గాను 3 వేల 600 కోట్ల రూపాయల మొదటి విడత నిధులను విడుదల చేశారు. అలాగే.. దేశంలోనే తొలిసారిగా 3డి కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో చేపట్టనున్న హౌసింగ్ పైలట్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి మేరకు రాష్ట్రానికి 3 లక్షల ఇళ్ళను కేటాయించామన్నారు. 3D టెక్నాలజీ ఇళ్ల ద్వారా నిర్మాణ సమయం, ఖర్చు, కూలీల అవసరం చాలా తగ్గుతుందని, ఇవి సాధారణ ఇళ్ల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు అందించేందుకు కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలోని భారత రాయబార కార్యాలయం వర్జీనియాలో నిర్వహించిన `వికసిత్ భారత్ యూనిటీ రన్`కు పెద్ద సంఖ్యలో భారతీయ అమెరికన్లు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరుగు, యోగా, ధ్యానంతో పాటు ఫిట్‌నెస్, సామాజిక భాగస్వామ్యాలను నిర్వహించారు. పొటోమాక్ నదికి సమీపంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రవాస భారతీయులు, ఇతరులు ఒకచోట కలిశారు. భారతీయులు క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకునే దిశగా ప్రోత్సహించే లక్ష్యంతో.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 సంవత్సరంలో `ఫిట్ ఇండియా` ఉద్యమాన్ని ఒక జాతీయ ప్రచారంగా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు శ్యామ్‌జీ కృష్ణ వర్మ జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఈరోజు ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్యం పట్ల శ్యామ్‌జీ కృష్ణ వర్మ నిబద్ధత, స్వాతంత్ర్య పోరాటంలో శాశ్వతంగా నిలిచిపోతుందని ఉపరాష్ట్రపతి సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. శ్యామ్‌జీ కృష్ణ వర్మ తన జీవితాన్ని స్వాతంత్ర్యం కోసమే అంకితం చేశారని, మాతృభూమి గౌరవాన్ని కాపాడటంలో ఆయన చూపిన ధైర్యం, అంకితభావాన్ని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కాగా.. స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు సుబ్రమణ్య శివ జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =